రాజర్షి ఓ క్షణం ఉలిక్కిపడ్డాడు. అతని గుండె అట్టడుగుపొరల్లో ఎక్కడో ఓ బాధాకరమైన భావన---ఓ పసి జీవితాన్ని పాపపంకిలం చేస్తున్నానేమోనన్న గిల్టీకాన్షన్‌నెస్. కేవలం ఓ క్షణం మాత్రమే. తేరుకున్నాడు రాజర్షి .

"శభాష్ ఉదయ్" భుజాన్ని అభయం యిస్తున్నట్లుగా మృదువుగా స్పృశించాడు రాజర్షి .

"ఎవర్ని చంపాలి?" ఉదయ్ కళ్ళల్లో పట్టుదల కన్పిస్తోంది.

"ఎవరో ఆయితే ఈ వేళలో ఈ చోటుకు రారు. నీ ఫ్రెండ్.... అదే మీ శశిభూషణ్ అంకుల్ కొడుకు రాంబాబు నీకు మంచి ఫ్రెండ్ కనుక నువ్వెక్కడికి రమ్మన్నా వస్తాడు.
ఇప్పుడే వెళ్ళి మర్డర్ సంగతి చెప్పకుండా యిక్కడకు తీసుకురావాలి. తీసుకు వచ్చాక ఎలా మర్డర్ చేయాలన్నది నీ తెలివితేటలకు వదిలేస్తున్నాను."

రాజర్షి కళ్ళల్లో ఉదయ్ సాహసాన్ని మెచ్చుకుంటున్న భావం స్పష్టంగా వ్యక్తమవుతోంది.

ఉదయ్ ఆవేశంగా లేచాడు "చూస్కోండి నాకెంత ధైర్యం వుందో" అన్నట్లు అతనికేసి చూసి వడివడిగా రాంబాబు యింటికేసి సాగిపోయాడు.

వెళ్ళిన అయిదు నిముషాలకే రాంబాబుని వెంటబెట్టుకుని వచ్చాడు ఉదయ్.

కొద్దిసేపు సినిమా విషయాలు మాట్లాడుకున్నాక రాజర్షి ఉదయ్‌కి సైగ చేశాడు.

ఉదయ్ హుషారుగా లేచి ప్రక్కలకు చూశాడు. దగ్గరలో ఎవరూ లేరు.

అంతా నిర్మానుష్యంగా వుంది.

రాంబాబుకి అనుమానం రాకుండా నేలవేపుకు చూపులు సారించాడు. రాజర్షి లేచి యిప్పుడే వస్తానంటూ వడివడిగా ముందుకు సాగిపోయాడు.

"నాకు భయంగా వుందిరా ఉదయ్! దెయ్యాలొస్తాయేమో... యింటికెళ్ళిపోదామా?" దాదాపుగా ఏడుస్తున్నట్లుగా చెప్పాడు రాంబాబు.

"పిరికివాడా! చిరంజీవి సినిమాలో చూశావా? గూఢచారి నంబర్ వన్ చూశావా? జేమ్స్‌బాండ్‌ను చూశావా? వాళ్ళకసలు భయం వుండదు ఎంత చీకటయినా. ఒక్క ఐదునిముషాలుందాం. రేపు నీవు నాతో సినిమాకి వద్దువుగాని. రాజర్షి అంకుల్ రేపు భలే సినిమా చూపిస్తానన్నాడు" నేలమీద దేనికోసమో వెతుకుతూనే అన్నాడు ఉదయ్.

ఉదయ్ వెతికే వస్తువు కనిపించింది రెల్లుపొదలో దాక్కుని. దాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేశాడు. కాని ఆంత తేలిగ్గా లేవలేదు.

బలమంతా ఉపయోగించి మరోసారి ప్రయత్నించాడు. అప్పుడు కదిలింది ఒకింత.

మొత్తానికి నాలుగయిదుసార్లు ప్రయత్నించాక లేచిందా వస్తువు.

అతికష్టంమీద ఆ వస్తువును రెండుచేతుల్తో పైకి లేపి ఎత్తిపట్టుకున్నాడు ఉదయ్.

తన వెనుక అతను చేస్తున్న పని రాంబాబు గ్రహించే స్థితిలో లేడు. అతనికి చీకటి, అందులో దాగిన మామిడితోపు భయం కలిగిస్తోంది.

సరిగా అదే సమయానికి ఊళ్ళోంచి నలుగురయిదుగురు పెద్దాళ్ళు తోటకేసి

పరుగెత్తుకొస్తున్నారు. వాళ్ళ చేతుల్లో వున్న హరికెన్ లాంతర్లు మిణుకుమంటూ దూరంనించే కనిపిచాయి ఉదయ్‌కి.

మరిక అలస్యం చేయకూడదనుకున్నాడు,

అంతే....

ఒక్కసారి రాంబాబు తలవేపు గురిచూశాడు.

దూరం నుంచి ఏదో అలజడి.

పదిమంది మాటలు, కేకలు అస్పష్టంగా వినిపించటంతో రాంబాబు ఒకింత ఆసక్తిగా ముందుకు వంగాడు.

అప్పటికే ఆ సమూహాపు రాకను పసిగట్టిన ఉదయ్ యిక ఆలస్యంచేస్తే తను హీరో అయ్యే అవకాశం పోతుందేమోనని కళ్ళు మూసుకుని జరువయిన బండ్రాయిని గురిచూసి రాంబాబు తలపైకి విసిరాడు.

అంతే....

మరుక్షణం రాంబాబు పెట్టిన కేక పొలిమేర వరకూ వ్యాపించింది.

అప్పటికి దగ్గరయిన సమూహం తమ కళ్లముందు జరిగిన దారుణమైన సంఘటన చూసి అప్రతిభులయిపోయారు. క్రింద నెత్తుటి మడుగులో రాంబాబు గిలగిలా కొట్టుకుంటున్నాడు.

సమూహం వేగంగా ఆ స్పాట్ కేసి కదిలింది.

అప్పటివరకూ స్థిరంగా నుంచున్న ఉదయ్‌లో హఠాత్తుగా చలనం వచ్చింది.

అంతే...

తేనేటీగలా తోపులోకి దూసుకుపోయాడు. మరుసటి ఉదయానికి పోలీసులు రావటం, ఉదయ్‌ని అరేస్టు చేయటం, రాజర్షి తన ఆశ్రమంలో సెటిల్ అవటం, పట్టాభి, మధుమూర్తి, దుర్గాదాసు  పండగ చేసుకోవడం, ఒకదాని వెనుక ఒకటి సాఫీగా సాగిపోయాయి.

ఉదయ్‌లాంటి రుజువర్తన గల పసివాడు రాంబాబును ఎందుకు చంపాడు?

ఆ టైంలో ఉదయ్ అక్కడ ఎందుకున్నట్లు? రాంబాబును ఉదయ్ అక్కడకు ఏ ఉద్దేశ్యంతో తీసుకెళ్ళినట్లు? అతన్ని ఎంతగా ప్రశ్నించినా సమాధానం చెప్పలేదు. చెప్పగలడన్న నమ్మకం కూడా లేదు.

ఒక్కగానొక్క కొడుకుని, ఎంతో గారాబంగా పెంచుకుంటూ వస్తున్న కొడుకు హత్యానేరంమీద అరెస్టు కాబడ్డాడు.

ఎన్ని విధాలుగా ప్రయత్నించినా, ఎంత డబ్బు ఖర్చు పెట్టేందుకు సిద్ధపడినా ప్రయోజనం కనిపించటంలేదు.

పరమశివం కుప్పలా కూలిపోయాడు.

ఒకరిద్దరు సాక్షులనయితే కొనేయగల స్తోమతున్నవాడే పరమశివం.

కాని దాదాపు పదిహేనుమంది దాకా ఉదయ్ బండరాయితో రాంబాబుని చంపటాన్ని

కళ్ళారా చూశారు.

చిన్న అసత్యం చెప్పటాన్ని కూడా అసహ్యించుకొనేలా పెంచుకుంటూ వస్తున్నాడు.

గంజాయిని పెంచటం తప్పు, చట్టవిరుద్ధం అని తను అనగా విని చిన్న వయసులోనే ఎంతో తెలివిగా, పోలీసులు వెంటాడుతున్న భ్రమ కలిగించి వాళ్ళంతట వాళ్ళే వారి సరుకును తగలబెట్టుకునేలా చేశాడు.

రోజూ తోటపని చేసినందుకు రివార్డ్‌గా తనిచ్చే యాభై పైసల నాణేల్ని కిడ్డీ బ్యాంక్‌లో భద్రంగా దాచుకునేవాడే తప్ప, ఏ రోజూ పది పైసలు ఖర్చు పెట్టలేదు. అక్కంటే ప్రాణమిచ్చేవాడు.

ఓ సారి ఎవరో అక్కని ఏదో అన్నారని వాడి తల పగలగొట్టాడు.

పరమశివం ఆలోచనలు టక్కున అగిపోయాయి. యస్...తన కొడుకు ఆవేశపరుడు కూడా... ఎవరన్నా రెచ్చగొట్టారా.

ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తన ప్రాణ సమానమైన కొడుకిప్పుడు సర్టి ఫైడ్ స్కూల్‌కి ఖైదీగా పంపబడనున్నాడు.

ఎవరెంతగా బ్రతిమిలాడినా నోరు విప్పటంలేదు. జరిగింది జరిగినట్లు చెబితే కోర్టు క్షమించి వదిలేయవచ్చని కూడా చెప్పిచూశాడు. అయినా నోరు విప్పలేదు.

నాన్నమ్మ, అక్క భోరున విలపిస్తున్నా ఉదయ్ పసి మొహంలోని గంభీరత చెక్కు చెదరలేదు.

సరిగ్గా అదే సమయంలో రాజర్షి ఒకింత ఆందోళనగా వున్నాడు. ఉదయ్‌గాని పొరపాటున జరిగింది జరిగినట్లు చెబితే తను బయటికి వస్తాడు. తనకేదో అవుతుందని అతనికి భయంలేదు.

కాని తాను పరమశివానికి విధించాలనుకునే శిక్ష తప్పిపోతుంది.

పట్టాభి, మధుమూర్తిల్ని అన్యాయం చేసిన పరమశివం కొడుకు బ్రతికే వున్నాడు. పరమశివానికి సపోర్టు చేసిన శశిభూషణ్ కొడుకును పోగొట్టుకుని సర్వనాశనమై పోయాడు.

రాజర్షి ఆలోచనలు ఇప్పుడు ఉదయ్ నిజం చెబితే ఏమిటన్న సందేహంపై నిలిచాయి.

0 0 0

నిద్రాహారాలు మానేసి పోలీస్ స్టేషన్ ముందే జాగారం చేస్తున్నారు పరమశివం, అతని భార్య, కూతురు.

అప్పుడొచ్చి ఆగిందో కారు---- అందులోంచి పట్టాభి, మధుమూర్తి దిగారు, దిగులుగా బెంచిమీద తలవంచుకుని కూర్చున్న పరమశివం దగ్గరకు వెళ్ళి గొంతులు సవరించుకున్నారు.

పరమశివం ఉలికిపాటుగా తలెత్తి చూశాడు.

"సారీ.....శివా......ఇప్పుడు విన్నాం. ఎలా జరిగింది? నీవూ, శశిభూషణ్ ప్రాణమిత్రులు,

అలాగే మీ కొడుకులు కూడా.."

పట్టాభి గొంతులో కృత్రిమయిన జాలి తొంగిచూసింది. పరమశివం భోరుమన్నాడు తప్ప మరేం మాట్లాడలేకపోయాడు.

"మరిప్పుడెలా?" మధుమూర్తి కేజువల్‌గా అడిగాడు.

పరమశివం వారి గొంతుల్లో తొంగి చూస్తున్నది కృత్రిమమయిన జాలి అని పసిగట్టే స్థితిలో లేడు.

"మేం వ్యాపారంలో దెబ్బతిని నాశనమయితే, నువ్వు ఒకే ఒక కొడుకుని పోగొట్టుకుని అంధకారంలోకి వెళ్ళిపోయావు. ప్చ్...... మాకు చాలా బాధగా వుంది.... వస్తాం శివా..." అంటూ వచ్చినంతసేపు వుండకుండా వెళ్ళిపోయారు.

ఉదయ్‌ని ఏలూరులోని శనివారపేటలోవున్న సర్టిఫైడ్ స్కూల్‌కి పంపే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

చిన్న పిల్లలు కదా అని నేరం చేస్తే వదిలేయదు చట్టం. అయితే వార్ని నిర్బంధించేది జైల్లో కాదు సర్టిఫైడ్ స్కూల్‌లో, అది జైలులా వుండదు. స్కూల్‌లా వుంటుంది.

ఇందులో వార్ని ఓ పక్క చదివిస్తూ, మరోపక్క చిన్న చిన్న వృత్తుల్లో శిక్షణ ఇస్తూ, ఎంతో కొంత సంపాదించుకునే అవకాశం ఇస్తారు.

పదహారు సంవత్సరాల వయస్సులో వున్నవార్నే సర్టిఫైడ్ స్కూల్‌కి పంపిస్తారు.

పదహారు సంవత్సరాలకు పైన పద్దెనిమిది సంవత్సరాల లోపు వున్న వార్ని బోస్టన్ స్కూల్‌కి పంపిస్తారు.

పద్దెనిమిది సంవత్సరాలు దాటితే జైల్‌కే పంపిస్తారు నేరుగా.

అప్పుడు కూడా నోరు విప్పలేదు ఉదయ్.

అతని ప్రవర్తన అటు రాజర్షికి.... ఇటు తల్లిదండ్రులకు పోలీసులకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఎందుకని ఉదయ్ నోరు మెదపటం లేదు. వ్యాన్ స్టేషన్ ముందు సిద్దంగా వుంది.

ఓ పోలీస్ వచ్చి సెల్‌లోంచి ఉదయ్‌ని బయటకు రమ్మన్నాడు.

నాలుగు రోజులుగా సరయిన తిండి, నిద్ర లేక చిక్కిపోయి, కళ్ళు లోతుకుపోయి దైన్యంగా వున్న ఉదయ్ మౌనంగా వ్యాన్ ఎక్కాడు.

కొడుక్కేసి పరిగెత్తుకురాబోయిన పరమశివాన్ని, అతని భార్యనూ, కూతుర్ని పోలీసులు ఆపేశారు.

వ్యాన్ బయలుదేరింది దుమ్ము రేపుకుంటూ. ఆ దుమ్ములో పరుగెడుతున్నారు పరమశివం, అతని భార్యా, కూతురు పిచ్చివాళ్ళలా, వెక్కి, వెక్కి ఏడుస్తూ.

0 0 0

శశిభూషణ్, అతని భార్యా, కూతురు నాలుగురోజులుగా పచ్చి మంచినీళ్ళు కూడా

ముట్టలేదు. తల పగిలిన కొడుకు శవమే శశిభూషణ్ కళ్లలో మెదిలి అతని పిచ్చివాడ్ని చేస్తోంది.

తనకు జరిగిన అన్యాయానికి న్యాయం చేకూర్చమని ఎవర్నడగాలి?

ఇది పిల్లల విషయంగానే అనిపిస్తోంది కనుక పరమశివాన్ని నిలదీయలేడు. ఇక మిగిలింది ఉదయ్. అతనిప్పుడు చిన్నపిల్లల జైలుకి వెళ్లనున్నాడు.

అయినా ఎవర్ని ఏం అడిగినా తన వంశాంకురం తిరిగి ప్రాణాలతో తనకు దక్కడు కదా?

"నాన్నా అన్నయ్య తలెందుకు పగిలింది?" ఎక్కిళ్ళ మధ్య అడిగింది శశిభూషణ్ కూతురు తండ్రి గడ్డాన్ని తన లేత చేతులతో కదిలిస్తూ.

ఏం చెప్పాలో తెలియని శశిభూషణ్ కూతుర్ని వళ్ళోకి లాక్కుని బావురుమన్నాడు.

0 0 0

"మనకు ఆస్థి పోయింది. వాళ్ళకు పిల్లలు పోయారు. మనం తిరిగి సంపాదించుకోగలిగినా వారికి మాత్రం ఆ అవకాశం లేదు"

పట్టాభి పగలబడి నవ్వాడు.

"ఎందుకయినా మంచిది మనం త్వరలో ఇక్కడినుండి మకాం లేపేయడం మంచిదేమో?" మధుమూర్తి అంత మత్తులోను కంగారుగా అన్నాడు.

" ఛట్...... నువ్వో పిరికి వెధవ్వి, అలా చేస్తే రాజర్షికి నిజంగానే మనమీద అనుమానమొస్తుంది" పట్టాభి కసురుకుంటూ అన్నాడు.

ఉదయ్ తన ఎనిమిదవయేట సర్టిఫైడ్ స్కూల్‌కి వెళ్ళాడు.

(అది 1974లో జరిగింది. కొన్ని కారణాలవల్ల ఉదయ్ నిర్బంధం 1984 వరకూ కొనసాగింది.

ఈ మధ్యలో జరిగిన సంఘటనలు ముందు ఫ్లాష్‌బ్యాక్‌లో వస్తాయి.

కధ తిరిగి 1984లో మొదలవుతుంది. అంటే ఉదయ్ రేపే జైలు నుండి వస్తాడనగా తిరిగి కధ మొదలవబోతోంది--- రచయిత)